నేటి దినపత్రిక
# సూర్య
సోమవారం 20 నవంబర్ 2023 పేజీలు 8
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు



# విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగపరుచుకోవాలి





### జడ్పిటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి

**వింజమూరు మేజర్ న్యూస్** విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగపరుచుకొని తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జడ్పిటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి తెలిపారు గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆరవ రోజు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న కార్యక్రమాలకు ఆయన సర్పంచ్ సృజన కాంగ్రెస్ నాయకులు మద్దూరు రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ సందర్భంగా గణపం బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగపరచుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు గ్రంథాలయాలలో సకల రంగాలకు చెందిన విజ్ఞానమంత కూడా ఉంటుందని తమకు అవసరమైన గ్రంథాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు పోటీ పరీక్షలకు అవసరమైన జ్ఞానాన్ని పొందేందుకు ఈ గ్రంథాలయాలు ఎంతో సహకారిగా ఉంటాయన్నారు గ్రంథాలయాధికారి సక్రమంగా గ్రంథాలయాలను తెరిచి విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంచడం సంతోషదాయకమన్నారు గ్రంథాలయాలు సమస్త విజ్ఞానానికి మూలంగా ఉంటూ ఎన్సైక్లోపీడియా ఆఫ్ బ్రిటానికా లాగా పనిచేస్తుందని విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయాన్ని సందర్శించి తమకు అవసరమైన గ్రంథాలను చదివే విజ్ఞానాన్ని పొందాలన్నారు ఉత్తమ భవిష్యత్తును పొందాలనుకుంటే గ్రంథాలయాల కంటే మరో మార్గం ఉండదని ఆయన తెలిపారు కనుక విద్యార్థులందరూ గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని కోరారు సర్పంచి ఎన్ సుజనా మాట్లాడుతూ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మాజీ భారత ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఆమె దేశానికి చేసిన సేవలను కొనియాడారు భారత తొలి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలుపరిచి వారి కుటుంబాలలో వెలుగులు నింపారన్నారు అదే విధంగా మహిళా పోలీసులు దిశా యాప్ గురించి తెలియజేశారు కాంగ్రెస్ నాయకులు రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలను చక్కగా ఉపయోగించుకుంటే విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు మంచి జ్ఞానం పొందే అవకాశం ఉంటుందన్నారు అదేవిధంగా విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు ఈ గ్రంథాలయంలో దొరుకుతాయని వాటిని ఉపయోగించుకొని చదువులో ఉత్తమ ఫలితాలను పొందాలన్నారు అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు మిఠాయిలు పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉన్నారు

# పార్టీలో ఊహించని స్పందన తెచ్చిన కదిరి నియోజకవర్గంలో వలసలు నివారించడమే లక్ష్యం




**వింజమూరు మేజర్ న్యూస్** భారతీయ జనతా పార్టీలో ప్రస్తుతం ఊహించనటువంటి స్పందన తీసుకొచ్చాడు ఉదయగిరి నియోజకవర్గం ఇంచార్జ్ కదిరి వెంకట రంగారావు నెల్లూరులో శనివారం జరిగిన బిజెపి సంస్థాగత సమావేశంలో నియోజకవర్గము నుండి తమదైన శైలిలో నా కార్యకర్తలను చైతన్యం చేస్తూ పార్టీ పట్ల అభిప్రాయాన్ని కలిగిస్తూ సుమారు 20 వాహనాలకు పైగా కార్యకర్తలను తరలించి అన్ని నియోజకవర్గాల కంటే ఉదయగిరి నియోజకవర్గం నుండి అత్యధికంగా కార్యకర్తలను తరలించి తమదైన శైలిలో అందరు సీనియర్ నాయకులను కూడా ఆశ్చర్యపరిచినాడు కదిరి ఎన్నడూ లేని విధంగా స్తబ్దతగా ఉన్న పార్టీని ఒక్కసారిగా మేల్కొలిపి సమావేశంలో ముందు శ్రేణిలో నిలిచాడు సీనియర్లు సైతం అబ్బురుపడడమే కాకుండా రాష్ట్ర అధ్యక్షురాలు సైతం ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసిన సంఘటన జరిగింది ఆయనలోని పట్టుదల ఆత్మవిశ్వాసం ముందుకు కదిలించింది ప్రధాని నరేంద్ర మోడీ అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను పరిశీలిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తూ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని కలిగిస్తూ తన పాత్రను అనూహ్యంగా సాగిస్తున్నాడు నియోజకవర్గాన్ని సైతం నిద్రలేపి దేశానికే దిక్సూచిగా ఉన్న బిజెపి పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ నాయకులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు కదిరి వెంకట రంగారావు నెల్లూరు సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఇతర జిల్లా రాష్ట్ర నాయకులను సైతం ఆశ్చర్యపరుస్తూ నియోజకవర్గ బలాన్ని శక్తిని నిరూపించుకున్నారు ఈ సమావేశంలో బూత్ కమిటీలను ఎలా బలోపేతం చేయాలో శక్తి కేంద్రాలను తన పనితీరు పట్ల ఎలా మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలో తెలుసుకుంటూ తన ఆలోచనలను నియోజకవర్గ వైపు నిలిపాడు జిల్లాలోని ఉదయగిరి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా నిలిపేందుకు అదే తన ధ్యేయంగా ఎంచుకొని ఎనలేని సేవ చేస్తున్నారు పార్టీని ఇంత వేగవంతంగా బలోపేతం చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది నియోజకవర్గం లో ఏ ఒక్క పార్టీ కానీ ఏ నాయకుడు కానీ అభివృద్ధి కోసం కృషి చేయలేదని కేవలం వారి స్వార్థ ప్రయోజనాల కోసమే పని చేశారు తప్ప వారి సొంత ఆలోచన లేదని ప్రజలపై అభిమానం లేదన్నారు నియోజకవర్గంలో బిజెపికి ఒక అవకాశం ఇచ్చినట్లయితే ముఖ్యంగా నియోజకవర్గంలో వలసలను నివారించి అందరికీ పనులు కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన నియోజకవర్గ ప్రజలకు మనవి చేశారు రానున్న ఎన్నికల్లో బిజెపి బలమైన శక్తిగా అవతరించి అధికారాన్ని చేపడుతుందని అప్పుడే ప్రజలకు మేలు కలుగుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు

### అయ్యప్ప ఆలయంలో అన్నదాన కార్యక్రమం

**వింజమూరు మేజర్ న్యూస్** వింజమూరులోని ప్రసన్నా రెడ్డి నగర్ లో వేంచేసియున్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని అయ్యప్ప భక్త బృందం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు తాళ్లపాలెం తిరుపతిరావు ధర్మపత్ని విజయలక్ష్మి కుమారుడు వెంకట సురేష్ కోడలు వెంకట సుకన్య మనవరాళ్ళు హిమాన్వి హిమాన్య ఉభయ దాతలుగా వ్యవహరించారు ఆలయ అర్చకులు సాయికుమార్ శర్మచే ఆలయంలోని మూల విరాట్



లకు పాలు పెరుగు నెయ్యి పంచామృతంతో అభిషేకాలు జరిపించారు ఈ కార్యక్రమాలను గురు స్వాములు చేబ్రోలు వసంత స్వామి ఏ సి డి సి ప్రసాద్ స్వామి వెలుగోటి కృష్ణ దేవర స్వామి మస్తాన్ రెడ్డి పర్యవేక్షించారు

### వింజమూరులో పత్రీజీ చైతన్యాజ్యోతియాత్ర:



**వింజమూరు మేజర్ న్యూస్** వింజమూరులోని శ్రీ వేదవాస వశిష్ట క్షేత్రం దగ్గర పత్రీజీ ధ్యాన మహాయాగం తరపున పత్రీజీ చైతన్య జ్యోతి రథయాత్ర కొనసాగింది ఈ కార్యక్రమంలో హైదరాబాదు సీనియర్ పెరమిడ్ మాస్టర్ రామ్మోహన్ రావు పిరమిడ్ సేవాదళ్ కన్వీనర్ కర్ర శివ పి .ఎం .సి .సభ్యులు పాల్గొన్నారు. ఈనెల 26,27 తేదీలలో రెండు రోజులు ఉచితంగా వర్క్ షాప్ జరుగుతుందని, శ్రీ సత్య సాయి ధ్యానమండలి వ్యవస్థాపకులు బిక్షమయ్య గురూజీ పర్యవేక్షణలో జరుగుతుందని, దీనికి అందరూ హాజరు కావాలని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తగిన ప్రణాళిక వేసుకొని అందరూ చర్చించుకుని తీర్మానించుకున్నారు. ఈనెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ప్రతిరోజు కరపత్రాలు పంచుతూ ,మైక్ ద్వారా ప్రచారం అన్ని గ్రామాలలో జరుగుతుందని, ఆసక్తి గల మాస్టర్ లందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలనీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. శాకాహారం యొక్క ప్రాముఖ్యతను గూర్చి నినాదాలు ఇస్తూ, కరపత్రాలు పంచుతూ ,పిరమిడ్ నగర్ ,వైశ్య బజార్, ఎర్రబెల్లి పాలెం ప్రధాన వీధుల ద్వారా మహా కరుణ – శాకాహార ర్యాలీ నిర్వహించారు. అందరికీ కందుల వారి పాలెం గ్రామానికి చెందిన శివ మాస్టర్ వారి చిన్నారి జన్మ దినోత్సవ సందర్భంగా చక్కటి ధ్యాన ప్రసాదం అందించారు .ఈ కార్యక్రమంలో విద్యుల్లత, హేమలత, దొరసాని ,సుప్రజా, రాజేశ్వరి, కృష్ణవేణి, ఆచారి, కృష్ణారెడ్డి రవిచంద్ర పద్మ రుక్మిణి ,నాగరత్నమ్మ, ఉమా ఇంకా 50 మంది ధ్యానులు పాల్గొన్నారు

### నెల్లూరు సిటీ ప్రజా ప్రభుత్వానికి అవకాశం ఇవ్వండి




**నెల్లూరు మేజర్ న్యూస్** అంటూ తెలుగుదేశం పార్టీ సిటీ ఇంచార్జ్ మాజీ మంత్రివర్యులు పొంగూరు నారాయణ గారు ప్రచారం లో భాగంగా ఈరోజు గాంధీ బొమ్మ వద్ద జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కలిసి వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు తోడుగా నడుస్తామని తెలిపారు నెల్లూరు నగర తెలుగుదేశం ఇన్ చార్జ్ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ నివాసం లో కలసి ప్రజా ప్రభుత్వం ఏర్పాటుకు ముందుకు సాగుదాం అంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపి సిటీ ఇంచార్జ్ నారాయణ, జనసేన ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్,జనసేన నాయకులు గూడూరు వెంకటేశ్వర్లు,పూసల మళ్ళేశ్వర రావు,తెలుగుదేశం పార్టీ నాయకులు కొండా ప్రవీణ్,సందీప్ మరియు ఇతర జనసేన,తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు..

## సీతాలమ్మ ,శ్రీ పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ...



**సంగం. మేజర్ న్యూస్.**సంగం మండలం అన్నారెడ్డి పాలెం గ్రామంలోని హరిజనవాడలో సీతాలమ్మ,శ్రీ పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని గ్రామ పెద్దలు వైభవంగా ఆదివారం నిర్వహించారు .ఈ సందర్భంగా విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వేదమంత్రాలతో విగ్రహాలను ప్రతిష్టించారు. ఈ ప్రతిష్ట మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## పెళ్ళికానుక అందజేత



**వింజమూరు మేజర్ న్యూస్**వింజమూరులోని మోటచింతల పాలెం గ్రామ నివాసులైన ఆరికొండ సుబ్బారావు కొండమ్మ దంపతుల కుమార్తె అయిన సునీత వివాహ సందర్భంగా కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10 వేల రూపాయలను పెళ్లి కానుకగా అందజేశారు ఐటిడిపి కోఆర్డినేటర్ ఆరికొండ శ్రీనివాసులు ట్రస్టు సభ్యులు పవన్ చేతుల మీదుగా ఈ నగదును పెళ్లి కుమార్తెకు అందజేశారు ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ నూతన వధువుకు వివాహ శుభాకాంక్షలు అందజేశారు

## రోడ్ల దుస్థితిని తెలియచేస్తూ జనసేన టీడీపీ నిరసన



**గూడూరు, మేజర్న్యూస్** రాష్ట్రంలోని రహదారుల దుస్థితిపై రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసి కనువిప్పు కలిగించాలని తెలుగుదేశం పార్టీ మరియు జనసేన పార్టీలు ఉమ్మడిగా ఆందోళన నిర్వహించారు. ఆదివారం ఆదివారం గూడూరు పట్టణ పరిధిలోని గూడూరు-విందూరు రహదారి దుస్థితిని ప్రజలకు తెలియజేస్తూ జనసేన, తెలుగుదేశం పార్టీ ఉమ్మడి కార్యాచరణలో భాగంగా గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మరియు జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ కేర్ టేకర్ తీగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గుంతల ఆంధ్రప్రదేశ్ కు దారేది కార్యక్రమంలో విందూరు రహదారి పరిస్థితిని ప్రజలకు తెలియజేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రచార ఆర్భాటాలు తప్ప రాష్ట్రంలో వైసీపీ చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. పట్టణంలో వైసీపీ ఎమ్మెల్లే వరప్రసాద్ సీసీ రోడ్ల నిర్మాణం పేరుతో శంకుస్థాపన చేసారని అవి ప్రచార అర్భటాలుగా మిగిలిపోయాయన్నారు. జనసేన, టీడీపీ సమావేశాల పీఓసీ మోహన్ మాట్లాడుతూ గతంలో గూడూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ తరఫున డిజిటల్ క్యాంపెయిన్ చేయడం జరిగినది అని ఇపుడు జనసేన, తెలుగుదేశం పార్టీలు ఉమ్మడిగా గుంతల ఆంధ్ర ప్రదేశ్ కు దారేది అని డిజిటల్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బిల్లు చెంచురామయ్య, భాస్కర్రెడ్డి, ఇజ్రాయేల్కుమార్, కిరణ్కుమార్, పులిమి శ్రీనివాసులు, జనసేన పార్టీ జనసేన పట్టణ, రూరల్ అధ్యక్షులు ఇంద్రవర్ధన్ భాస్కర్లు నాయకులు నాగార్జున, సాయి, శ్రీను, నవీన్, శివ, శ్రీనాథ్, మస్తాన్, కళ్యాణ్, ప్రసాద్, హరి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, చెంచురామయ్య, శ్రీధర్, పాల్గొన్నారు.


# ఇందిరమ్మ కాలనీ రోడ్డుపై గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేదికార్యక్రమం.నిరసన తెలియజేసిన టిడిపి, జనసేన.





**కావలి మేజర్ న్యూస్:**ఆదివారం తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉమ్మడిగా కావలి పట్టణ ఇందిరమ్మ కాలనీ రోడ్డులో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు మరియు జనసేన పార్టీ ఇంచార్జ్ అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది" కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఇరు పార్టీ శ్రేణులు డౌన్ డౌన్ సీఎం రోడ్లు వేయలేని సీఎం దిగిపోవాలి చేతకాని ప్రభుత్వం గద్దె దిగాలి, ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం - గుంతల రాజ్యం దొంగల రాజ్యం అంటూ నినాదాలు చేశారు.కావలి టిడిపి, జనసేన ఇన్చార్జిలు మాట్లాడుతూ నిన్నటి రోజున ఇదే కార్యక్రమం తుమ్మలపెంట రోడ్డులో చేపట్టడం జరిగిందని, ఈరోజు ఇందిరమ్మ కాలనీలోని రోడ్ల దుస్థితిని పత్రిక విలేకరుల ద్వారా ప్రజలకు చూపుతున్నామని, ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు.వైసీపీ ప్రభుత్వం కనీసం రహదారులను నిర్మించలేని దిక్కుమాలిన పరిస్థితిలో ఉందని, కనీసం గోతులను కూడా పూడ్చలేని దుస్థితిలో ఈ చేతకాని ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని మండిపడ్డారు. ప్రస్తుత రోడ్ల దుస్థితి రాష్ట్ర వ్యాప్తంగా ఉందని, ప్రజలకి ఎవరు అభివృద్ధి చేస్తారు ఎవరు దోచుకుంటారో అర్థం అవుతుందని, రాబోయే రోజుల్లో ప్రజలే వైసీపీకి బుద్ధి చెప్పి తెలుగుదేశం, జనసేనల ఐక్య అభ్యర్థులను గెలిపించుకొని రాష్ట్రంలో సుపరిపాలనకు స్వాగతం పలికెందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో విచ్చేసి జయప్రదం చేసిన టిడిపి, జనసేన శ్రేణులకు ధన్యవాదాలు తెలియజేశారు.

# కేటాయింపుల సాగుకు దోకా లేదు



### నేటి నుంచి నీటి విడుదల

### నీటి పొదుపే పరమావధి

### పంపిణీ వినియోగంపై శ్రద్ధ చూపాలి

### వరుణని కటాక్షం గగనమే

**అనంతసాగరం ( మేజర్ న్యూస్)**ఈ ఏడాది జిల్లా రైతాంగం మొదటి పంట సాగునీటికి గడ్డుకాలమే శరణ్యం అయింది. అయినప్పటికీ జిల్లా సాగునీటి సంఘం తీర్మానించిన కేటాయింపులకు నీటి సౌలభ్యం కు దోకా లేదనే చెప్పాలి. అయితే జలాశయంలో ప్రస్తుతం నీటి నిల్వ కరువు రక్కసిని తలపిస్తూ ఉండడంతో జిల్లా పెన్నా డెల్టా రైతాంగం వినియోగం విషయంలో పొదుపే పరమావధిగా సాగు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.గత ఏడాది కంటే జలాశయంలో నీటి నిల్వ నిండుకుని ఉన్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా కేవలం 2.20 లక్షల ఎకరాలకు కేటాయింపులు ఐ ఏ బి ( జిల్లా సాగునీటి సలహా సంఘం) సమావేశం తీర్మానించింది. అందుకు 20 టీఎంసీల నీరు పెన్నా ఆయకట్టు సాగుకు పంపిణీ చేయాల్సి ఉంది.నేటి నుంచి జలాశయం నుండి నీటి పంపిణీ అధికారికంగా మొదలుకానున్నది. ప్రస్తుతం జలాశయంలో 29.5 టీఎంసీల నీటిని ఉన్నది. కేటాయింపులకు 20 టీఎంసీల ల నీరు మినహాయిస్తే మిగిలిన దానిలో 7.5 టిఎంసిల నీటిని డెడ్ స్టోరేజీ గా ఉంచాల్సిన పరిస్థితి. ఇక మిగిలేది కేవలం రెండు టీఎంసీలు మాత్రమే. ఈ నేపథ్యంలో సమావేశంలో తీర్మానించిన మేరకు కేటాయింపులు చేపట్టాల్సిన క్రమంలో ఇటు అధికారులు అటు జిల్లా డెల్టా రైతాంగం పంపిణీ, వినియోగం విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనపరచాల్సిన అవసరం ఉంది.ప్రస్తుత వాతావరణ పరిస్థితులను, తీవ్రంగా మంచు పడుతున్న స్థితిని గమనిస్తే వరుని దేవుని రాక గగనమే అనిపిస్తోంది.భవిష్యత్తులో నెల్లూరు జిల్లా త్రాగునీటి అవసరాలకు ప్రస్తుత కేటాయింపుల మినహాయింపు నీటితోపాటు లీకేజీ, సిపేజీ ల ద్వారా వృధా అవుతున్న సుమారు 100 క్యూ సేక్కుల నీటికి పక్కా నియంత్రణ చేపట్టాల్సిన అవసరం ఉంది.లేకుంటే రాబోవు వేసవిలో జిల్లా ప్రజలు త్రాగునీటి కష్టాలను ఎదుర్కోక తప్పదు అనిపిస్తోంది.ప్రస్తుతం అందరి ముందు ఉన్న లక్ష్యం నీటి వృధా లేకుండా పొదుపుగా వాడాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తోంది. అలా నీటి పొదుపే సాగిస్తే మరో 30 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం లేకపోలేదు.మూడు దశాబ్దాల క్రితం ఒక్క టిఎంసి నీటితో 8,500 ఎకరాలు సాగు చేయవచ్చని అధికారిక లెక్కలు ఉన్నాయి. అయితే దెబ్బతిని ఉన్న పంట కాలువల లైనింగ్ ద్వారా నీటి వృధాను అరికడితే,అలాగే రైతులు నీటిని వినియోగించే క్రమంలో నిర్లక్ష్యం వహించకుండా శ్రద్ధ కనపరిస్తే. ఒక్కో టిఎంసి నీటితో వరి సాగుకు 12 వేల కు పైగా ఎకరాలకు, మెట్ట ప్రాంతాల్లోని ఆరుతడి పంటలకు 14 వేల ఎకరాలకు పైగా నీరు అందించవచ్చు.ఈ విషయంలో ఆది నుంచి ఆలోచనలకే, కాగితాలకే ఆ లెక్కలు పరిమితం అయ్యాయి.ప్రతి వర్షపు నీటి చుక్కను ఓడిసి పట్టాలని,వినియోగ జలాల వృధాను అరికట్టాలని ప్రాజెక్టు, ఇరిగేషన్ అధికారులు తలస్తున్నారే తప్ప ఆచరణలో పెట్టిన దాఖలాలే లేవు. నేటికీ ప్రాజెక్టుల వద్ద చెరువుల వద్ద నిత్యం పదుల క్యూసెక్కుల సంఖ్యలో నీటి వృధా దర్శనమిస్తోంది. చక్కటి నీటి నియంత్రణ, పర్యవేక్షణ విషయంలో గతంలో ఉన్నట్టుగా నేడు లేకపోవడం జిల్లా రైతాంగానికి శాపంగా మారింది.ఇక సోమశిల జలాశయం కు సంబంధించి నీటి లీకేజీ అన్నది యధా రాజా తథా ప్రజా అన్నట్టుగా సాకుతోంది.నీటి వృధా మాట పక్కన పెడితే గతంలో ఉత్తర దక్షిణ కాలువల లింకు కెనాల్ ద్వారా రాజకీయ ప్రయోజనాల కొరకో, లేక ఇతర లోపాయకర ఒప్పందాల మేరకో అనధికారికంగా నీటి విడుదల రహస్యంగా సాగేది. అప్పట్లో ఈ విషయాలపై రైతులకు అధికారులకు మధ్య వాదోపవాదాలు జరిగి కూడా ఉన్నాయి.ఈ విధంగా వృధా నీటి నియంత్రణ,నీటి భద్రత విషయంలో సమగ్రమైన పర్యవేక్షణ బాధ్యతాయుత విధి నిర్వహణ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో గట్టిగా చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

## వివాహకార్యాల్లో వధూవరులను ఆశీర్వదించిన డాక్టర్ "చిల్లూరు"





**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరులో ఆదివారం జరిగిన వివాహమహోత్సవాల్లో మండల మాజీజెడ్పిటిసి సభ్యులు, మున్సిపల్ జెసిఎస్ కన్వీనర్ డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై మున్సిపల్ పరిధిలోని జాలయ్యనగరం వద్ద శ్రీధర్‌గార్డెన్స్ కళ్యాణమండపంలో వైసిపినేత పందిళ్ళపల్లి శివకుమార్‌రెడ్డి-భాగ్యలక్ష్మిల కుమార్తె కల్పన, కమతం శేషారెడ్డి-ప్రసన్నమ్మల కుమారుడు ప్రమోద్‌కుమార్‌రెడ్డిల వివాహం జరుగగా పాల్గొన్న డాక్టర్ ఆదిశేషయ్య వధూవరులను ఆశీర్వదించి వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మకూరు పట్టణ వైసిపి అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, వైసిపి నాయకుడు నోటి వినయ్‌కుమార్‌రెడ్డిలు కూడా వధూవరులను ఆశీర్వదించారు. పట్టణంలోని త్రికోటేశ్వరకళ్యాణమండపంలో అల్లారెడ్డి శ్రీధర్‌రెడ్డి-సుసీల దంపతుల కుమారుడు అఖిల్‌రెడ్డి, పాలేటి ప్రభాకర్‌రెడ్డి-మాధవి దంపతుల కుమార్తె స్పందనారెడ్డిల వివాహం జరుగగా పాల్గొన్న డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య వధూవరులను ఆశీర్వదించి వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. అల్లారెడ్డి ఆనందరెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డిలు కూడా పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## .గ్రంథాలయంలో ఇందిరాగాంది జయంతి



**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరు పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయవారోత్సవాల్లో భాగంగా ఆదివారం భారతదేశ ఏకైక మహిళా ప్రధానమంత్రిగా వ్యవహరించిన దివంగత ఇందిరాగాందీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాందీ చిత్రపటానికి లైబ్రేరియన్ ఓంకారం శ్రీనివాసరాజు, ప్రగతి ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఎస్.రామ్మోహన్‌రెడ్డి, రిటైర్డ్ లైబ్రేరియన్ ఏ.గోవిందరెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందిరాగాంధీ జీవితవిశేషాలను వారు వివరించారు. ఆమె దేశానికి, దేశ ప్రజలకు అందించిన సేవలను గురించి వివరించారు. శ్రీనివాసరాజు మాట్లాడుతూ సోమవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహిస్తామని, ఇటీవల తాము విద్యార్థులకు నిర్వహించిన వివిద పోటీల్లో విజేతలకు బహుమతాప్రధానం గావిస్తామని పేర్కొన్నారు. ముగింపు కార్యక్రమానికి పాఠకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రీనివాసరాజు కోరారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ రికార్డ్‌అసిస్టెంట్ ఎల్. తనూజ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాటినుండి నేటివరకు వైసిపిని ప్రాణంగా భావించా



### -కక్షసాధిస్తున్న ఎమ్మెల్యే

### -కౌన్సిలర్ "సూరా" ఆవేదన,ఆరోపణ

**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్‌లో ఉంటూ ఆయన తనయుడు వెస్ఆర్‌సిపి ఏర్పాటు చేసిన వెంటనే ఆపార్టీలో చేరానని, పార్టీ అభ్యర్థుల విజయానికి పట్టుదలగా కృషిచేశానని, కానీ స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తనపై కక్షసాధిస్తున్నారని ఆత్మకూరు పట్టణంలోని 20వవార్డు మున్సిపల్ వైసిపి కౌన్సిలర్ సూరా భాస్కరరెడ్డి పేర్కొన్నారు. కొంతకాలంగా వైసిపి రెబల్ కౌన్సిలర్‌గా ఉంటున్న భాస్కరరెడ్డి ఆదివారం తమ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. తాను వైఎస్ఆర్ అభిమానిగా కాంగ్రెస్‌లో కొనసాగానని, జగన్మోహన్‌రెడ్డి వైసిపిని ఏర్పాటుచేశాక ఆత్మకూరులో తొట్టతొలిగా తానే పార్టీపతాకాన్ని చేతబట్టానని, నాటినుండి స్థానిక సంస్థ, సార్వత్రిక, శాసనమండల ఎన్నికల్లో వైసిపి అభ్యర్థుల విజయానికి తనవంతుగా తీవ్రంగా కృషిచేశానని, నాడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మేకపాటి గౌతంరెడ్డిల విజయానికి, ప్రస్థుత ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయానికి తాను పట్టుదలగా కృషిచేశానన్నారు. తెలుగుదేశం హయాంలో తాను నానా అవస్థలు పడ్డానని, తనకు ఏఎస్‌పేట, ఆత్మకూరులో మద్యం దుకాణాలు వేలంద్వారా లభించగా వాటిని ఏర్పాటుచేయకుండా అడ్డుకున్నారని, తీవ్రంగా ఇబ్బందిపడి అధికారులద్వారా ఎట్టకేలకు ప్రారంభించానన్నారు. ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించేలా నిర్ణయించగా ఆత్మకూరు పట్టణ శివార్లలో తన స్వంత వ్యయంతో ఏర్పాటుచేసిన గదిని ప్రభుత్వం స్వీకరించి నెలవారీగా అద్దె చెల్లిస్తున్నారని ఆయన వివరించారు. గత మున్సిపల్ ఎన్నికల్లో తాను వైసిపి అభ్యర్థిగా 20వవార్డునుండి పోటీచేసి విజయం సాధించి కౌన్సిలర్‌గా కొనసాగుతున్నానని, వార్డులో అభివృద్ధి పనులు కావాలని అడిగితే ఎమ్మెల్యే సహకరించడంలేదని, గతంలో ఓస్‌డిగా ఉన్న చెన్నయ్య అత్యంత చులకనగా మాట్లాడారని, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులచేత కూడా తనకు వ్యతిరేకంగా మాట్లాడించారని సూరా వివరించారు. తాను పార్టీకి చెందిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపిలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు, ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిలను కలిశానని, అదే పెద్ద తప్పుగా రాజమోహన్‌రెడ్డి నిందించారని ఆయన వివరించారు. వార్డులో అభివృద్ధి పనులు కావాలని అడిగితే మంజూరుచేయకపోగా కొన్ని పనులను ఇతరులకు ఇతరత్రా మార్గంలో అప్పగించారని, తనకు సహకరించనందున కొంతకాలంగా ఎమ్మెల్యే వద్దకు వెళ్ళడంలేదని, కానీ ఆయన కక్షకట్టి తనకు చెందిన మద్యం దుకాణపు అద్దెను రద్దుచేయించారని సూరా ఆవేదనతో చెబుతూ ఆరోపించారు. ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారని, తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటారని సూరా భాస్కరరెడ్డి పేర్కొన్నారు. పార్టీలోనే ఉన్న తాను పార్టీనాయకులను కలవడం తప్పుగా, ప్రజాప్రతినిధిగా వార్డు అభివృద్ధి కోరడం తప్పుగా భావించి కక్షసాధించడం విడ్డూరంగా ఉందని సూరా పేర్కొన్నారు.

## షిరిడిసాయిరామ్‌కు వేమన యూనివర్శిటి దూరవిద్య కోర్సులకు అనుమతి

**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరులోని శ్రీ షిరిడిసాయిరామ్ డిగ్రీ, పి.జి కాలేజికి కడప వేమన యూనివర్శిటి డిస్టెన్స్ ఎడ్యుకేషన్(దూరవిద్య) కోర్సులకు అనుమతి లభించిందని కాలేజి కరస్పాండెంట్ డాక్టర్ కె.ఎన్.రాజు పేర్కొన్నారు. ఈమేరకు అడ్మిషన్లు కూడా ప్రారంభించామని, పి.జి, డిగ్రీ కోర్సులను దూరవిద్య ద్వారా అభ్యశించాలని ఆసక్తిగలవారికి ఈకోర్సులు అందుబాటులోకి వచ్చాయని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎం.ఏ కోర్సులో ఇంగ్లీష్,తెలుగు,హిస్టరి, ఎకనామిక్స్ గ్రూపు, పొలిటికల్‌సైన్స్,ఫిజియాలజీ, జర్నలిజమ్ గ్రూప్‌లతోపాటు ఎం.కామ్,



ఎంబిఏ కోర్సులు, బిఏ, బికామ్,బిఎస్‌సి కోర్సుల్లో ప్రవేశానికి అవకాశం ఉందని, అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఆసక్తిగల వారు 9440540910, 8297013555 నెంబర్లతో సంప్రతించాలని డాక్టర్ రాజు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తిగల వారంతా సద్వినియోగం చేసుకోవాలని రాజు కోరారు.

# కాంగ్రెస్‌కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతివేడుకలు



**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరు పట్టణంలోని కాంగ్రెస్‌కార్యాలయం(రాజీవ్‌భవన్)లో ఆదివారం దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 106వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి సూచనలతో పిసిసి ప్రధానకార్యదర్శి, ఆత్మకూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ చేవూరు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా యువజనకాంగ్రెస్ అధ్యక్షుడు వన్నం నాగరాజు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి నాగరాజు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ భారతదేశంలో ఇప్పటివరకు ఏకైకమహిళాప్రధానమంత్రి ఇందిరాగాంధీ అని, ఆమె దేశంలో ఎన్నో సంస్కరణలు, బడుగు,బలహీనవర్గాలకు ఎన్నో సంక్షేమపథకాలు అమలుచేశారని, దేశప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మరాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఇందిరమ్మరాజ్యం రానుందన్న ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ యువజనకాంగ్రెస్ అధ్యక్షుడు గంగపట్ల రాంకీ, కాంగ్రెస్ నాయకులు ఎస్.డి.రసూల్, ఏ.వేణు, కె.విష్ణు, ఎల్.రవీంద్రనాథ్‌రెడ్డి, కె.శ్రీనివాసులు, ఎస్‌డి.అమీర్‌బాషా, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఐ సిఎండిఏ వరల్డ్ రికార్డ్ మెడల్స్ ప్రశంస పత్రాలు బహుకరణ




**గూడూరు (సూర్య):** గత సంవత్సరం డిసెంబర్లో జరిగిన ఆరిగిరి నందిని స్తోత్రం ను 13 నిమిషాల పాటు ఏకధాటిగా శ్రీ సాయి బృందాకాడమీ వారి ఆధ్వర్యం లో ఐ సి ఎం డి ఏ నిర్వహించిన వరల్డ్ రికార్డ్ మెగా ఈవెంట్లో 40 మంది కళాకారులు వరల్డ్ రికార్డ్ కు ఎంపికయ్యారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ ముత్యాలమ్మ దేవస్థానం ఆలయ చైర్మన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కోడూరు కల్ప లత, సాయి సత్సంగ నిలయం నిర్వాహకులు నిర్వాహకులు కోటా సునీల్ పాల్గొని, ఎంపికైన కళాకారులకు ప్రశంసా పత్రాలు మెడల్స్ బహుకరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ నాట్యము సర్వరోగస్తుందని మనోవికాసాన్ని ఏకాగ్రతను పెంచుతూ చక్కని వివేకాన్ని పెంపొందిస్తుంది అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో శ్రీ సాయి నృత్య బృందా అకాడమీ వ్యవస్థాపకులు శ్రీనివాసులు నాట్యాచారిని శైలజ శ్రీనివాస్ కోఆర్డినేటర్ కరిముల్లా విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఓటర్ల సవరణలపై చర్యలు తీసుకోండి



**గూడూరు, మేజర్‌న్యూస్** నియోజకవర్గ పరిధిలోని ఓటరు నమోదు కేంద్రాల్లో వచ్చిన సవరణ దరఖాస్తులపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఓ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశాఇంచారు. ఆదివారం ఉదయం ఆర్డీఓ కార్యాయలంలో నిర్వహించిన120 అసెంబ్లీ(గూడూరు) నియోజకవర్గం నందు గల ఐదు మండలముల తహశీల్దార్లు, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్, సూపర్ వైజర్లు మరియు కంప్యూటర్ ఆపరేటర్లుతో సమీక్ష సమావేశం జరిపారు. సదరు సమావేశములో ఎలక్షన్స్ కి సంబంధించి ఓటరు నమోదు సవరణలపై తక్షణం రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఉదయగిరిలో బిగ్ స్క్రీన్ ఏర్పాటు



**ఉదయగిరి మేజర్ న్యూస్.** క్రికెట్ వరల్డ్ కపఫైనల్లో భారత్–అస్ట్రేలియా జట్ల మ్యాచ్ను తిలకించేందుకు క్రికెట్ అభిమానుల కోసం ఉదయగిరి ని యోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు మండల వైసీపీ కన్వీనర్ గానుగపెంటఓబులరెడ్డి స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్లో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. సాయంత్రం సమయంలో వీక్షకులకు నిర్వాహ కులకు టీ, స్నాక్స్ సైతం ఏర్పాటు చేశారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందించిన- నేదురుమల్లి



**వాకాడు మేజర్ న్యూస్** కోట మండలం విద్యానగర్లోని నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విద్యా సంస్థలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అధ్యాపకులను విద్యాసంస్థల కరస్పాండెంట్, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ చైర్మన్,తిరుపతి జిల్లా అధ్యక్షులువెంకటగిరి నియోజవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి అభినందించారు వాకాడులోని ఆయన నివాసంలో ఆదివారం ఎన్బికెఆర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు అగ్రిసెట్ రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన శివశంకర వరప్రసాద్ 8వ ర్యాంక్,. మౌనిక 27వ ర్యాంకు, మీనాక్షి 32వ ర్యాంకులను సాధించారు అదేవిధంగా సైన్స్ అండ్ ఆర్ట్స్



కళాశాలలో సెకండ్ బీఎస్సీ చదువుతున్న పి.లావణ్య ఎన్ సి సి లో ఐ. జి. సి, ఆర్. డి. సి సికింద్రాబాద్లో పూర్తి చేసుకుని వచ్చిన విద్యార్థిని మరియు యూనివర్సిటీ పరీక్షలలో రెండో సంవత్సరం చదువుతున్న హిమజ అనే విద్యార్థులని 9.72 శాతం మార్కులు పొంది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలియజేశారు. ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకునిగా పనిచేస్తున్న గోవిందు. మాధవయ్య కి డాక్టరేట్ పొందిన సందర్భంగా వారిని కూడా నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి అభినందించినారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి..

### సిఐ రవి నాయక్...

**సంగం.మేజర్ న్యూస్.** మహిళలు పురుషులతో సమానంగా ధైర్య సాహసాలతో ముందుకు సాగాలని, మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సంగం సర్కిల్ ఇన్స్పెక్టర్.రవి నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా
సంగం శాఖ గ్రంథాలయములో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవములలో భాగంగా మహిళా దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ రవి నాయక్.ని గ్రంథాలయ బండారి, రవీంద్రనాథ్ రెడ్డి ఆహ్వానించారు. మరియు గురుకుల బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమతి మరియు నేతాజీ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ మధర్ భాష హాజరైనారు.ఈ కార్యక్రమంలో మొదటగా స్వర్గీయ ఇందిరా గాంధీ మరియు ఝాన్సీ లక్ష్మీ బాయిల జయంతి సందర్భంగా వారి యొక్క చిత్రపటాలకు పూలమాలలతో అలంకరించి వారికి ఘన నివాళులుఅర్పించారు. అనంతరం సి ఐ రవి నాయక్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ మన దేశానికి చేసిన సేవలను పిల్లలకు వివరించారు ఝాన్సీ లక్ష్మీ బ్రిటిష్ వారితో పోరాటం చేసి దత్తత స్వీకారం చేపట్టారు, బిడ్డను నడుముకు కట్టుకొని బ్రిటిష్ వారితో యుద్ధాన్ని చేపట్టారు అని వివరించారు. దిశా చట్టం గురించి అవగాహన కల్పించారు దిశా చట్టం యొక్క ఉపయోగాలను పిల్లలకు తెలియజేశారు ప్రతి ఒక్క విద్యార్థి తమ ఇళ్లలో ఉన్న మొబైల్ ఫోన్లందు దిశా చట్టం యాప్ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు మహిళా సాధికారత సాధించాలంటే ప్రతి ఒక్క విద్యార్థిని సాధికారత పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. అధికారం లేకపోతే మనం ఏమి చేయలేమని అందుకే ప్రభుత్వం ముందుచూపుతో మహిళలకు సాధికారత



అందించాలని ఎన్నో పథకాలను మహిళల పేర్లతోనే అమలు పరుస్తుందని కావున ప్రతి ఒక్కరూ మహిళా సాధికారత నందు సభ్యులుగా చేరాలని సూచించారు. ఈ సందర్భంగా లైబ్రరీన్ రవీందర్ నాథ్ రెడ్డి బాలికలకు గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు సండే క్లబ్ నందు ప్రత్యేక విద్యార్థి హాజరై సండే క్లబ్ ను విజయవంతం చేయాలని కోరారు. పిల్లలు గ్రంథాలయమునందు సభ్యులుగా చేరి పుస్తకాలను ఇంటికి తీసుకుని వెళ్లి చదువుకునే విధానమును వివరించారు. గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమతి మాట్లాడారు.ఈ సందర్భంగా అతిథులను ఉచిత రీతిన సన్మానించడమైనది.ఈ కార్యక్రమం విజయవంతమునకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి గ్రంథ బాండా రి రవీంద్రనాథ్ రెడ్డికృతజ్ఞతలు తెలియజేశారు.

## బీసీలపై ఎన్నాళ్లీ దౌర్జన్య కాండ??

### గంజాం రాఘవేంద్ర, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి

**కొండాపురం మేజర్ న్యూస్** నెల్లూరు నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర ఆదివారం ప్రకటనలు తెలిపారు.ఈ సందర్భంగా రాఘవేంద్ర మీడియాతో మాట్లాడుతూజగన్ రెడ్డి అనే దుర్మార్గుడు అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి రాజారెడ్డి నెత్తుటి కత్తితో రాసిన రాజ్యాంగాన్ని అమల్లోకి తెచ్చాడు. నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో బీసీలపై పూటకో దాడి, రోజుకో హత్య అన్నట్లు సాగుతోంది అని ,బీసీలపై ఎన్నాళ్లీ దౌర్జన్య కాండ అని అవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబు అధికారంలోకి వచ్చేనాటికి 16 వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో బీసీలు కోసం ప్రత్యేకంగా సబ్ ప్లాన్ తీసుకొచ్చారు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వేల కోట్ల బడ్జెట్ కేటాయించారు. లక్షలాది మందికి కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చారు. ఆదరణతో పనిముట్లు, విద్యా ఉద్యోగ ఉపాధికి ప్రోత్సాహకాలు అందించారు. రాష్ట్రస్థాయి పదవుల్లో బీసీలను నియమించి రాజకీయంగా ప్రోత్సహించారు. జగన్ రెడ్డి వచ్చాక బీసీలకు సంక్షేమ పథకాలు రద్దుచేసి వారి నిదులు లాక్కుని వారి అధికారాలను లాక్కొని బీసీలు అంటే కేవలం ఓట్లు మాత్రమే అనే పరిస్థితి కల్పించారు. ఇలాంటి జగన్మోహన్ రెడ్డికి బీసీలకు విషయంలో బస్సు యాత్రలు చేసే అర్హత ఉందా అని ప్రశ్నించారు.వైసిపి పాలనలో బీసీలకు రిజర్వేషన్లు కరువయ్యాయని అడుగడుగునా అవమానాలు ఎదురయ్యాయని



అన్నారు..టిడిపి హయాంలో టీటీడీ చైర్మన్గా బీసీలకు మూడుసార్లు అవకాశం కల్పిస్తే వైసిపి హయాంలో సొంత సామాజిక వర్గానికి కట్టపెట్టారని ఎద్దేవా చేశారు..వైసీపీ బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటుందని బీసీలు తమ సత్తా చూపించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు..బడుగు బలహీన వర్గాలు చంద్రబాబు పాలన కోసం ఎదురుచూస్తున్నాయని వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన 30 బీసీల సంక్షేమ పథకాల ప్రారంభం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు.జగన్మోహన్ రెడ్డి బీసీలకు చేస్తున్న అన్యాయాన్ని అందరూ గమనిస్తున్నారని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని పేర్కొన్నారు.2024లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ప్రజా ప్రభుత్వం బీసీల ప్రభుత్వం ఏర్పడడం తద్యమని అన్నారు...

# ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని సత్కరించిన ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు.



**నెల్లూరు మేజర్ న్యూస్:** నెల్లూరు మాగుంట లేఅవుట్ కృష్ణ చైతన్య జూనియర్ కళాశాలలో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని మూడు జిల్లాల నుంచి వచ్చిన పలువురు ప్రైవేట్ పాఠశాలల నాయకులు కలిసి అభినందించారు. ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలలకు 8 సంవత్సరాల గుర్తింపు సాధించడంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి కృషి ఎంతో ఉందని వారు కొనియాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు చంద్రశేఖర్ రెడ్డి ప్రైవేటు పాఠశాలలకు 8 సంవత్సరాల గుర్తింపు తీసుకువస్తానని హామీ ఇచ్చారని . ఇచ్చిన హామీ ప్రకారం ప్రైవేటు పాఠశాలకు ఎనిమిది సంవత్సరాలు రెన్యువల్ లభించేలా ప్రభుత్వాన్ని ఒప్పించి జీవో విడుదల చేయించడం ఎంతో సంతోషకరమని తెలిపారు.అంతేకాకుండా ఇప్పటివరకు మూడు సంవత్సరాలు గుర్తింపు కలిగిన పాఠశాలకు కూడా ఎనిమిది సంవత్సరాలు వర్తించే విధంగా నేడు జీవో నెంబర్ 90 ని తీసుకురావడం ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి ఘనత అని కొనియాడారు.

రెన్యువల్ కు ఆన్ లైన్ ద్వారా మాత్రమే కాకుండా ఆఫ్ లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడం సంతోషకరమని అపుస్మా రాష్ట్ర నాయకులు నేతాజీ సుబ్బారెడ్డి అన్నారు. ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్ల నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి అయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతు చెప్పాడంటే చేస్తాడంతే అన్న మాటకు నిదర్శనం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నని,ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు.ఈరోజు విద్య, వైద్యం ఈ రెండు రంగాలకు వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి, భావితరాల భవిష్యత్తుకు, బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నని కొనియాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందే ప్రైవేటు పాఠశాలల గుర్తింపుకు సంబంధించి ఉన్న ఇబ్బందులను వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినప్పుడు.. ముఖ్యమంత్రి ఎంతో సానుకూలంగా స్పందించి కచ్చితంగా చేద్దామని మాట ఇచ్చారని తెలిపారు.ఆ మాట ప్రకారమే ఈరోజు ప్రైవేటు పాఠశాలలకు 8 సంవత్సరాలు గుర్తింపు లభించేలా ప్రభుత్వం జీవో విడుదల చేసిందని తెలిపారు.ఇప్పటికే రెన్యువల్ చేసుకొని మూడు సంవత్సరాలు గుర్తింపు పొందిన పాఠశాలలకు ఎనిమిది సంవత్సరాలు గుర్తింపు దక్కేలా అవకాశం కల్పించాలని కోరినప్పుడు.. ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి ,మంత్రి బొత్స సత్యనారాయణ ఎంతో సానుకూలంగా స్పందించి,ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవో విడుదల చేయించారని తెలిపారు.అనంతరం పలువురు ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు,ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు.

# రక్తదానం చేసి ప్రాణదాతలు కండి.



**నెల్లూరు మేజర్ న్యూస్** ప్రముఖ న్యాయవాది , మేనేజింగ్ కమిటీ మెంబర్ ఐ .ఆర్. సి. ఎస్ నెల్లూరు జిల్లా శాఖ దాసరి రాజేంద్రప్రసాద్తన జన్మదిన సందర్భంగా 47 వ సారి రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ నందు స్వచ్ఛందంగా రక్తదానము చేశారు. దాసరి రాజేంద్రప్రసాద్ తన సందేశంలో రక్తము యొక్క ఆవశ్యకత రక్తదానము చేయడం వలన కలుగు ప్రయోజనాలను వివరిస్తూ ప్రతి ఒక్కరు సంవత్సరంలో నాలుగు సార్లు రక్తము దానము చేయవచ్చు అని, ఒక్కరు చేసే రక్తదానం వలన ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చునని, కృత్రిమంగా రక్తం తయారు చేయలేమని , అత్యవసర పరిస్థితులలో ప్రాణాలు కాపాడుట కొరకు ప్రతి ఒక్కరు రక్తదానం చేస్తూ వారి కుటుంబ సభ్యులను బంధువులను , స్నేహితులను రక్తదానం చేయవలసిందిగా ప్రోత్సహించవలనని కోరారు. ప్రతి ఒక్కరు తమ కుటుంబ సభ్యులను, స్నేహితులను ,తీసుకువచ్చి సమాజానికి రక్తదాతలు చేస్తున్న సేవా స్ఫూర్తిని వివరించి వారిని రక్తదానము , ఇతర సామాజిక సేవా కార్యక్రమం లో పాల్గొనేలా తీర్చిదిద్దాలని తెలియచేసారు . అలానే చలి కాలంలో విషజ్వరాల ప్రభావం ప్రజల మీద ఉన్నందున రక్తం , ప్లేట్లెట్ ఆవశ్యకత ఉన్నందున ముఖ్యంగా ప్రతి ఒక్కరు రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ నందు వారి పేర్లను నమోదు చేసుకొని అత్యవసర పరిస్థితులలో రక్తము దానము చేయుటకు సంసిద్ధముగా ఉండవలనే పిలుపునిచ్చారు. ఇటువంటి కార్యక్రమములో పాల్గొని సమాజసేవ చేస్తూ ఇతరులకు స్ఫూర్తినివ్వవలసిందిగా కోరారు.

ఈ సందర్భంగా దాసరి రాజేంద్రప్రసాద్ ని రెడ్ క్రాస్ రక్త నిధి కన్వీనర్ చంద్రగిరి అజయ్ బాబు శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమములో అడ్వకేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.వి నరసయ్య, బీజేపీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ పి. భాస్కర్, న్యాయవాదులు ఓ.వెంకటరాజు, పి. రామకృష్ణ, జి. కేశవులు, మొర్గ్ కన్వీనర్ ఏ. సాయిరాం , రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సియం సభను విజయవంతం చేద్దాం : కామిరెడ్డి



**పెళ్లకూరు మేజర్ న్యూస్ :**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 21 వ తేది అనగా మంగళవారం సూళ్లూరుపేట నియోజకవర్గం కి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య అతిధిగా విచేస్తున్న సందర్భంగా సియం సభను విజయవంతం చేయాలని నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. మండలంలోని చిల్లకూరు గ్రామంలో తన నివాసం మందు ఏర్పాటు నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం మొత్తం మీద 100 బస్సు లను ఏర్పాటు చేసారని వాలంటీర్స్ ప్రత్యేక పాత్ర పోషించి పెద్ద ఎత్తున ప్రజలు సియం సభకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు. సియం సభకు వాలంటీర్స్ తో పాటు గృహ శారదులు సచివాలయం కన్వినర్ లు స్థానిక నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు నన్నం ప్రిస్కిల్లా, తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు మడ్డలి సోమశేఖర్ రెడ్డి, మండల కన్వినర్ ఒబ్బు వెంకటరత్నం, వైస్ ఎంపిపి బెల్లపు రవి రెడ్డి జెసియస్ కన్వినర్ కరుణం రఘునాయుడు,యువజన విభాగ అధ్యక్షులు ఓడూరు వినోద్ రెడ్డి, నాయకులు లింగం నాయుడు, అట్ల కృష్ణయ్య, వీరకుమార్,బండి బాలు, సాగి జితేంద్ర, అట్ల గోపాల్, సర్పంచ్ లు ఎంపిటిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గేదెలు ఇవ్వకుండానే రూ.2,800 కోట్లు స్వాహా

### -మాజీ ఎమ్మెల్యే బొల్లినేని



**ఉదయగిరి మేజర్ న్యూస్** రాష్ట్రంలో వైసీపీ నాయకులు లబ్ధిదారులకు పాడి గేదెలు ఇచ్చినట్లు పత్రాలు సృష్టించి రూ.2,800 కోట్ల ప్రభుత్వ సొమ్మును స్వాహా చేశారని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక చెంచలబాబు అతిథి గృహంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న అధ్యక్షతన క్లస్టర్, యూనిట్ ఇన్చార్జుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు తక్కువ ధరకు టెండర్ వేసి జామాయిల్ కటింగ్లో రూ.300 కోట్లు దోచుకొన్నారన్నారు. మోటార్లకు మీటర్ల ఏర్పాటులో కడప జిల్లాకు చెందిన ఓ కాంట్రాక్టర్ రూ.7 వేల కోట్లు లూటీ చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం మరిచి దోచుకోవడమే ధ్యేయంగా పాలన సాగిస్తుందని ధ్వజమెత్తారు. టీడీపీకి కార్యకర్తలే వెన్నుముకని, ప్రతిఒక్కరు మనస్ఫూర్తిగా చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో అధికారాన్ని తిరిగి దక్కించుకోవడానికి ప్రజలను మభ్య పెట్టే విధంగా వైసీపీ కుట్రలు చేస్తోందన్నారు. తన హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు వైసీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మూడు రాజధానులని చెప్పి ఒక్క రాజధాని నిర్మించలేదన్నారు. నాసిరకం మద్యం. సేవించి రాష్ట్రంలో 5 లక్షల మంది ప్రాణాలు విడిచారన్నారు. ప్రస్తుతం సోమశిల జలాశయంలో 30 టీఎంసీల నీరున్నా ఇవ్వలేదని, తమ హయాంలో 12 టీఎంసీల నీరు ఉన్నప్పుడే ఉత్తర కాలువకు నీరిచ్చామన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు. రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్, నియోజకవర్గ పరిశీలకులు వికాస్ హరికృష్ణ మాజీ ఏఎంసి చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి బొజ్జ నరసింహులు రియాజ్ నల్లిపోగు రాజా సందాని తదితరులు పాల్గొన్నారు

## హైబీబియా క్లినిక్ లో

### ఉచితంగా బి ఎం డి పరీక్షలు



**అనుమసముద్రంపేట మేజర్ న్యూస్** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని హబీబియా క్లినిక్ లో ఆదివారం ఉచితంగా బి ఎం డి బోన్ మినరల్ డెన్ సిటీ పరీక్షలు నిర్వహించారు డాక్టర్ ఖాజామీయా డాక్టర్ సిరాజ్ ల ఆధ్వర్యంలో 60 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు అనంతరం క్యాల్షియం బిఎండి విలువ తక్కువగా ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు సుమారు 2000 రూపాయలు విలువ కలిగిన ఈ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి పొంగూరు నారాయణ.



**నెల్లూరు మేజర్ న్యూస్:** నెల్లూరు నగరంలోని సంతపేటలోని సోమిశెట్టి కళ్యాణమండపంలో వెంకటేశ్వర్లు - భాగ్యరేఖ నూతన వధూవరులను మాజీ మంత్రివర్యులు పొంగూరు నారాయణ ఆశీర్వదించారు అదేవిధంగా నవాబుపేటలోని ఓ కళ్యాణ మండపంలో జరిగిన ఓ వివాహ వేడుకలో నూతన వధువరులైన వెంకట సుమశ్రీ, చరణ్ లను ఆయన ఆశీర్వదించారు. మీ దాంపత్య జీవితం నిండు నూరేళ్ల హ్యాపీగా సాగాలని నారాయణ ఆకాంక్షించారు. అనంతరం మాజీ మంత్రి నారాయణతో దంపతులు ఫోటో దిగారు.

## వడి వడిగా సభా ప్రాంగణం హెలిపాడ్ పనులు





**తడ మేజర్ న్యూస్** ఈనెల 21 న మత్స్యకార దినోత్సవ సందర్భంగా తడ మండలంలో పర్యటించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అపాచీ పరిశ్రమ సమీపంలో జరగనున్న బహిరంగ సభ ఏర్పాట్ల కోసం సభా ప్రాంగణం, స్టాల్స్ , హెలిపాడ్ పనులు వడివడిగా ముమ్మరంగా సాగుతున్నాయి ఈ పనుల ను సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తూ త్వరిత గతిన పూర్తి చేసేటట్లు చర్యలు తీసుకుంటున్నారు . జిల్లా అధికారులు ముఖ్యమంత్రి పర్యటనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బందోబస్తు పటిష్టంగా ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నారు .

## నెల్లిపూడి లో ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకంటే కార్యక్రమం.

**వాకాడు మేజర్ న్యూస్** వాకాడు:మండల పరిధిలోని నెల్లిపూడి గ్రామంలో సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటేలికార్యక్రమం జరగనున్నది. కార్యక్రమం వైకాపా మండల జె సి ఎస్ కన్వీనర్ ఏనుగు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో, సీనియర్ రాజకీయ నాయకుడు, వాకాడు సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి పర్యవేక్షణలో, వైకాపా మండల కన్వీనర్ నే దురమల్లి రంజన్ రెడ్డి, నెల్లిపూడి గ్రామపంచాయతీ సర్పంచ్ బందిల పోలమ్మ నెల్లిపూడి మాజీ ఎంపీటీసీ సభ్యులు వెంకటయ్య నెల్లిపూడి ఉపసర్పంచి అట్ల శ్రీహరి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో తోట గోపీనాథ్ తెలిపారు

# ప్రజా సంక్షేమం అభివృద్ధి మా లక్ష్యం





## చేజర్ల సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమములోఎంపీపీ తూమాటి

**చేజర్ల, మేజర్ న్యూస్:**రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసి ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్నారని చేజర్ల మండల పరిషత్ అధ్యక్షులు తూమాటి విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం రెండో రోజు చేజర్ల సచివాలయం పరిధిలోని తిమ్మాయిపాలెం, బోడిపాడు, చేజర్ల వారి కండ్రిక గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా సచివాలయ వ్యవస్థను రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అదేవిధంగా రైతులకు అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులను గ్రామంలోనే పొందేలా చేశారన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి తెచ్చే విధంగా విలేజ్ హెల్త్ క్లినిక్. పాడి రైతుల కోసం బల్ మిల్క్ కలెక్షన్ భవనాలను అందుబాటులోకి తెచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే సమస్యలను తెలుసుకొని ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నామన్నారు. తిమ్మాయపాలెంలో ప్రజలు తమకు సైడ్ కాలువలు కావాలని కోరారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి తెలిపి సైడ్ కాలువలు ఏర్పాటు చేయిస్తానని అన్నారు. చేజర్ల కండ్రికలో రోడ్లు సైడ్ కాలువలు కావాలని కోరారు త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు అనంతరం సంక్షేమ పథకాల బుక్ లెట్ ను లబ్ధిదారులు అందజేశారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆవులు వెంకటేశ్వర్లు,మండల వైఎస్ఆర్సిపి నాయకులు బోయిళ్ళ మాలకొండ రెడ్డి,బొడిపాడు వైస్ సర్పంచ్ రత్నారెడ్డి, రసూల్,వార్డు సభ్యులు పెంచల స్వామి,పెంచ ల నారాయణరెడ్డి, కళ్యాణ్,పెంచలయ్య, బాలయ్య, సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

## గుంతల రోడ్డుపై టీ.డి.పి, జనసేన పార్టీల నిరసన



**సైదాపురం మేజర్ న్యూస్**:-గుంతల ఆంధ్రప్రదేశ్ కు దారేది అనే కార్యక్రమం లో భాగంగా సైదాపురం నుండి దేగపూడి పోవు గుంతల రహదారి పై ఆదివారం టీ.డి.పి మరియు జనసేన పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంను చేపట్టారు.ఈ సందర్భంగా గుంతల రోడ్డుపై వెంకటగిరి నియోజకవర్గం మాజీ ఏం.యల్.ఏ కురుగొండ్ల రామకృష్ణ మరియు టీ.డి.పి నాయకులు అలాగే జనసేన పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త గూడూరు వెంకటేశ్వర్లు మరియు జనసేన పార్టీ నాయకులు,కార్యకర్తలు రోడ్డుపై కూర్చుని నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వెంకటగిరి నియోజకవర్గం మాజీ ఏం.యల్.ఏ కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి రోడ్డులను మరమ్మత్తు చేయలేదన్నారు.ఈ రహదారి పై గుంతల కారణం గా అనేక ప్రమాదాలు జరుగుతున్నప్పటికి అధికార పార్టీలో ఎటువంటి స్పందన లేదన్నారు.కావున ఇప్పటికైనా రోడ్లు మరమ్మత్తులు చేయాలని,అదే విధంగా కొత్త రోడ్లు వేయాలని తెలిపారు.అంతేకాకుండా 2024 సంవత్సరంలో జరిగే ఎన్నికలలో జనసేన,తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం జరుగుతుందని తెలిపారు

## దాడికిగురైన జర్నలిస్ట్‌ను పరామర్శించిన బిజెపి నేతలు



**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** చేజర్లమండలంలోని యనమదలలో ఓ దినపత్రిక జర్నలిస్ట్‌పై ఇటీవల అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకులు దాడిచేయగా ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ బొగ్గుల తిరుపతిరెడ్డిని ఆదివారం బిజెపి జిల్లా అధ్యక్షుడు , ఇతర నాయకులు పరామర్శించారు. తిరుపతిరెడ్డిపై దాడిచేయడం, ఆయన ఆత్మకూరు హాస్పిటల్‌లో చికిత్సపొందుతున్న విషయం తెల్సిందే కాగా బిజెపి జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, ఇతర నాయకులు ఆయనను పరామర్శించి, ఆయన ఆరోగ్యం గురించి, దాడిసంఘటనా వివరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతిరెడ్డికి తాము అండగా ఉంటామని, ఈవిషయమై జిల్లా ఎస్‌పికి కూడా ఫిర్యాదు చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు కాలం బుజ్జిరెడ్డి, కంది మల్లికార్జునరెడ్డి, బత్తల కృష్ణయ్య, కుంకు బాలయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బండారుపల్లిలో టెంకాయచెట్లు నరికివేత



**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరు మండలంలోని బండారుపల్లిలో రెండు రోజుల క్రితం గడ్డం జయరామయ్యకు చెందిన పొలంలో టెంకాయచెట్లను అదే గ్రామానికి చెందిన బొమ్మిరెడ్డి రాజా, బొమ్మిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, బొమ్మిరెడ్డి వెంకటరెడ్డిలు కక్షతో నరికివేశారని బాధితుడు పేర్కొంటూ ఈమేరకు పోలీసులకు ఫిర్యాదుచేశానన్నాడు. తాను తెలుగుదేశం పార్టీకి చెందినవాడనని, గతంలో కూడా పొలం సర్వే చేస్తుండగా ఇదే వ్యక్తులు వచ్చి అడ్డగించి తీవ్రంగా మాట్లాడారని, అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశానని పేర్కొన్నాడు. మళ్ళీ ఇపుడేమో తన పొలంలో టెంకాయచెట్లను నరికివేసి నష్టపరిచారని, ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశానని, పోలీసులు విచారించి నిందితులపై చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని జయరామయ్య కోరారు.

# పట్టణంలో మద్యం దుకాణాలు వద్దు బార్‌లే ముద్దు




- అధికారుల కొత్త నిబంధనలు
- కాసుల కోసం కక్కుర్తి
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- బార్‌లలో అధిక ధరలు
- మద్యం ప్రియుల అగచాట్లు

**గూడూరు, మేజర్‌న్యూస్** మద్యం విక్రయాలపై ప్రభుత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నా అధికారులు కక్కుర్తి మరింత ఎక్కువ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మద్యం దుకాణాల ఏర్పాటు చేయడంపైనే విమర్శలు వస్తుంటే ఉన్న వాటిని బార్‌ల కోసం తొలగించడంతో పెద్ద ఎత్తున దుమారం చెలరేగుతోంది. గూడూరు పట్టణంలో మొదటగా చిల్లకూరు పోటుపాళెం రోడ్డులో ఒక షాపు, చిల్లకూరు సర్వీస్ రహదారికి ఒక దుకాణం, జాతీయ రహదారిపై పోటుపాళెం కూడలి వద్ద ఒక దుకాణం, పట్టణంలోని గౌడ్ దుకాణ సముదాయం పరిధిలో ఒకటి, పాత బస్టాండ్ వద్ద ఒకటి, పాత నిమ్మకాయ కొట్టు కూడలి వద్ద ఒక దుకాణం, జిఎస్‌రాయలు రోడ్డులో ఒక దుకాణం సాదుపేటలో ఒక దుకాణం, కోర్టు ఎదురుగా ఒక దుకాణం, రాపూరు రహదారిలో ఒకటి, మాళవ్యనగర్‌లో ఒక దుకాణం వంతున ఏర్పాటు చేశారు. దుకాణాలు సజావుగా సాగుతూ మద్యం ప్రియులకు అనువుగా ఉన్నాయి. ఆ సమయంలో పట్టణంలో మూడు బార్ అండ్ రెస్టారెంట్‌లు కూడ నడుస్తున్నాయి. అయితే ఈ సారి కొత్తగా ప్రభుత్వం ఆద్వర్యంలో మద్యం దుకాణాలతోపాటు బార్‌లకు టెండర్లు పిలిచి మూడు బార్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ బార్ నిర్వహాకులతో కుమ్మక్కైన ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ దుకాణాలకు ఎసరు పెట్టారు. మొదటగా చిల్లకూరు జాతీయ రహదారి వద్ద ఉన్న మూడు దుకాణాలను పోటుపాళెం కూడలి వద్ద జాతీయ రహదారిపక్కన నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన బార్ కోసం మూడు షాపులను తరలించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్న సాకుతో ఆ షాపులను ఇతర ప్రాంతాలకు తరలించారు. అదే విదంగా గూడూరులో మద్యం దుకాణాలకు చిరునామాగ ఉన్న దూడల కాలువ కేంద్రం వద్ద ఉన్న మద్యం దుకాణాన్ని కూడ తొలగించి గాంధీనగర్‌కు తరలించారు. అక్కడ నుంచి కొండాగుంటకు తరలించి తమ ఘనత చాటుకున్నారు. ఇక పట్టణ పరిధిలోని రెండు షాపులను మరో బార్ కోసం రెండు రోజుల క్రితం పట్టణ శివారు ప్రాంతాలకు తరలించి బార్ యజమానుల వద్ద కాసులు దండుకున్నట్లు తెల్సింది. గూడూరు పట్టణంలోని మద్యం దుకాణాలు ప్రభుత్వానికి కాసుల వర్షం కురిపించేవంటే అతిశయోక్తి కాదు. ప్రతి దుకాణం రెండు లక్షల రూపాయలపైనే విక్రయాలు జరిగేవని ఆ షాపుల రికార్డులు పరిశీలిస్తే తెలుస్తుంది. అయితే బార్ యజమానుల మామూళ్లకు కక్కుర్తి పడి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రైవేటు వ్యక్తులు మద్యం షాపులు నిర్వహించే సమయంలో పట్టణంలో షాపులపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా కనీసం పట్టించుకున్న నాధుడు లేడు. ప్రస్తుతం మద్యం ప్రియుల సౌలభ్యం కన్నా బార్ యజమానులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి మద్యం దుకాణాలను శివారు ప్రాంతాలకు తరలించి తమ ఘనత చాటుకుంటున్నారు. అందుబాటులో ఉన్న దుకాణాలు శివారు ప్రాంతాలకు తరలడంతో మద్యం కోసం అంతేసి దేరం వెళ్ల లేక అగచాట్లు పడుడుతున్నారు. బార్‌లలో అదిక ధరలతో మద్యం ప్రియులు ఇబ్బందులు పడుతున్నారు. క్వార్టర్ బాటిల్‌పై మద్యం దుకాణంలో 130 రూపాయలు అయితే బార్‌లలో 200 రూపాయలకు కొనుగోలు చేయాల్సి వస్తుందని మద్యం ప్రియులు ఆవేదన చెందుతున్నారు. ఎక్సైజ్ అధికారులు బార్‌ల యజమానులతో కుమ్మక్కై మద్యం దుకాణాల తరలింపు చేశారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బార్ యాజమాన్యాలు మద్యం దుకాణాలు తొలగించేలా చేస్తే దుకాణ యజమానలకు, ఎక్సైజ్ అధికారులకు పెద్ద మొత్తంలో ముట్ట చెప్పినట్లు తెల్సింది. మద్యం దుకాణం యజమానులను లోబరుచుకుని బార్ యాజమాన్యాలు దుకాణాల సరిధిలో సమస్యలు వస్తున్నట్లు సృష్టిస్తూ తరలింపుకు చర్యలు తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బార్‌లలో నిబంధనలు తుంగలో తొక్కి ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి తెల్లవాదులు విక్రయాలు చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యహరిస్తున్నారు. మద్యం ప్రియులు జేబులు కొల్లగొడుతూ బార్‌లు వ్యవహరిస్తున్నా పట్టించుకునే నాధుడు లేకున్నారు. పట్టణంలో మద్యం ప్రియులకు అందుబాటులో దుకాణాలు లేకుండా చేసి ఎక్సైజ్ అధికారులు సొమ్ము చేసుకుంటున్నట్లు తెల్సింది. మద్యం దుకాణాల నుంచి గొలుసు దుకాణాల వరకు మామూళ్లు వసలూ చేసుకుంటున్నట్లు తెల్సింది. గొలుసు దుకాణాల వద్ద ఎక్సజ్ అధికారులు పది వేల రూపాయలు వంతున వసూలు చేసుకుంటూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అంతకు మునుపు ఎక్సైజ్ సిబ్బంది దగ్గరుండా మద్యం కల్తీ చేస్తూ పెద్ద ఎత్తున మోసం చేస్తూ పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. సెబ్ అధికారులు కూడ లక్ష్యం గాలికి వదలి అందిన వరకు వసూలు చేసుకుంటూ వారికంటే తామేమి తక్కువ కాదన్నట్లు వ్యవహరిస్తూ ఇసుక, ఇతర మైనింగ్ వాహనాల వరకు దండుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏదిఏమైనా పట్టణంలో మద్యం దుకాణాల తొలగింపుకు కారణమైని అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు మద్యం ప్రియుల అగచాట్లు తొలగించే విధంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలి -ఎంపీ ఆదాల

### శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారినిదర్శించుకున్న ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి



**నెల్లూరు,మేజర్‌న్యూస్:** నెల్లూరు దర్గామిట్టలో వెలసియున్న శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి దేవస్థానంలో శ్రీ మీనాక్షి దేవి సమేత శ్రీ సుందరేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈనెల 17వ తేదీ నుండి 19వ తేదీ వరకు శ్రీశ్రీశ్రీ సుందరేశ్వరస్వామి వారి నూతన ధ్వజ ప్రతిష్టాకుంభాభిషేక మహెూత్సవములు వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా ఆదివారం శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ద్వజారోహణ ప్రతిష్టాపన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. నెల్లూరు జిల్లా, రూరల్ నియోజకవర్గంలోని ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని, ప్రజలు ఎల్లవేళలా అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని కోరుకోవడం జరిగిందని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి తెలియజేశారు. అమ్మవారి దేవస్థానంకు విచ్చేసిన ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డికి ఆలయ మర్యాదలతో దేవస్థానం అర్చకులు, పాలకమండలి సభ్యులు పూర్ణకుంభముతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్, విజయ డైరీ చైర్మన్ కొండ్రెడి రంగారెడ్డి, దేవస్థానం చైర్మన్ గూడంశెట్టి దొరబాబు, 28వ డివిజన్ ఇన్చార్జి నెల్లూరు మధున్ మోహన్, సన్నపురెడ్డి పెంచల్ రెడ్డి,28 డివిజన్ కన్వీనర్లు సురేష్ రెడ్డి, వెంకట శ్రీధర్, రమణయ్య, కృష్ణ ప్రసాద్, మల్లికార్జున, కృష్ణ మోహన్ రెడ్డి, భార్గవి రెడ్డి, మోహన్ నాయుడు, శివరామ కృష్ణా, నందూరి హరిత రెడ్డి, జిల్లా వైఎస్‌ఆర్సిపి ప్రధాన కార్యదర్శి వేలూరు శివ సునీల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి షేక్ రియాజ్, జిల్లా వైఎస్‌ఆర్సిపి యూత్ అధ్యక్షులు మంగలపూడి శ్రీకాంత్ రెడ్డి, దేవస్థానం ఈవో ఏ శ్రీనివాసులు రెడ్డి, కార్పొరేటర్లు ఒరిస్సా శ్రీనివాసులు రెడ్డి మూలే విజయభాస్కర్ రెడ్డి షేక్ సత్తార్ మొయిల్లా గౌరీ, జానా నాగరాజ్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు నూనె మల్లికార్జున్ యాదవ్, సయ్యద్ మొబీనా, పార్టీ సీనియర్ నాయకులు స్వర్ణ వెంకయ్య, పాశం శ్రీనివాస్, సిహెచ్ హరిబాబు యాదవ్, కోడూరు కమలాకర్ రెడ్డి, లక్ష్మీ సునంద, ఆదిరెడ్డి, ఏవీఎస్ రెడ్డి, రొంపిచర్ల సుబ్బారెడ్డి, ముడియాల రామిరెడ్డి, పాతపాటి పుల్లారెడ్డి, నీళ్ల సునీల్ యాదవ్, ఉడత మురళి యాదవ్, ఇసనాక సురేందర్ రెడ్డి, కువ్వాకొల్లు బాబ్జి యాదవ్, సన్నపు రెడ్డి వెంకటసుబ్బారెడ్డి, జడ్పిటిసి సభ్యులు మల్లు సుధాకర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ ఓట్టూరు సుధాకర్ యాదవ్, షేక్ నవాబ్ జాన్, తురక సూరిబాబు, మల్లె బోయిన వెంకటేశ్వర్లు యాదవ్, కొండేటి నరసింహారావు, మైపాడు అల్లాబక్షు, పుల్లూరు చంద్రమౌళి, ఏ వినోద్ కుమార్ రెడ్డి, బండి వెంకటప్రసాద్, వేమిరెడ్డి మల్లికార్జున రెడ్డి, వై శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనలో భద్రతకు కట్టుదిట్టంగా చర్యలు





**తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సూర్య మేజన్ న్యూస్** రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల నవంబర్ 21వ తేదీన తిరుపతి జిల్లాలోని సూళ్లూరుపేట నియోజక వర్గంలోని తడ మండలం మాంబట్టు అపాచీ పరిశ్రమ సమీపంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవం 2023 సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల శంఖుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొననున్నారని పర్యటనలో చిన్నపాటి లోపలకు తావివ్వరాదని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి అధికారులకు సూచించారు.ఏ ఎస్ ఎల్ లో( ముందస్తు భద్రత లైజన్) భాగంగా ఆదివారం ఉదయం రేణిగుంట విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి,జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి తో కలిసి సమీక్షించిన అనంతరం ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన తేది.21.11.2023న ఉ.9.45గం. కు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి 10.20 గం. లకు మాంబట్టు సెజ్ హెలిపాడ్ చేరుకుంటారని,అనంతరం 10.45 గం. కు బహిరంగ సభ ప్రాంగణం చేరుకొని ఫోటో ఎక్జిబిషన్ సందర్శన,మత్స్య శాఖ,ఆర్ అండ్ బి,ఇరిగేషన్ శాఖల పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ఆవిష్కరణ అనంతరం ప్రజలనుద్దేశించి సిఎం ప్రసంగించి మ. 12.40 గంటలకు హెలిపాడ్ వద్ద ప్రజాప్రతినిధులతో, స్థానికులతో మాట్లాడి మ.01.45 గం. హెలిపాడ్ నుండి రేణిగుంట విమానాశ్రయం చేరుకొని మ.2.15 గం.కు గన్నవరం తిరుగుప్రయాణం కానున్నారని తెలిపారు.అనంతరం ఏఎస్ఎల్ లో భాగంగా తడ మండలం మాంబట్టు సెజ్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, బహిరంగ సభ ప్రాంగణాన్ని సిఎం కార్యక్రమ ఏర్పాట్లపై స్థానిక సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య,గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్,జెసి డికే బాలాజీ,ఎస్పీ సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.సిఎం పర్యటనకు ఏర్పాట్లు పగడ్బందీగా ఉండాలని అధికారులు సమన్వయంతో ప్రణాళికా బద్ధంగా పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు.సభావేదిక వద్ద ఫోటో ఎక్జీబిషన్,సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు,సభా ప్రాంగణంలో సీటింగ్ ఏర్పాటు, త్రాగు నీటి వసతి,ప్రజలు కూర్చునే ఎంక్లోజర్ లు వాటి మేనేజ్మెంట్, వాటికి స్టికరింగ్,పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు,ఎల్ఈడి బ్యాక్ డ్రాప్,నిరంతర విద్యుత్ సరఫరా, స్టాండ్ బై జనరేటర్ ఏర్పాటు, మోబిలైజేషన్,శానిటేషన్,మెడికల్ క్యాంపు ఏర్పాటు,సేఫ్ రూమ్ ఏర్పాటు,అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్,ఇంటర్నెట్ సౌకర్యం, సీసిటివి కెమెరాల ఏర్పాటు, పర్యవేక్షణ,అంబులెన్స్,108, అభివృద్ధి కార్యక్రమాల శంఖుస్థాపన శిలాఫలకాల ఏర్పాటు తదితరాల ఏర్పాటు పై విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ తరపున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుపుతూ పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకాళహస్తి రవిశంకర్ రెడ్డి,ఆర్డీఓ సూళ్లూరుపేట చంద్రముని,ఆర్డీఓ గూడూరు కిరణ్ కుమార్,ఏఎస్పీ లు కులశేఖర్,విమల కుమారి, వెంకట్రావు,డిఎంహెచ్ఓ శ్రీహరి, జిల్లా ఆర్ అండ్ బి అధికారి సుధాకర్ రెడ్డి,నెల్లూరు ఎస్ఈ ఏపీఎస్పీడీసీఎల్ విజయన్,జిల్లా ఫైర్ అధికారి రమణయ్య,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.